క్లుప్తంగా

ఏనమీద తండాలో వైద్య శిబిరం



కార్మికులకు మందులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వైద్యులు

మహేశ్వరం: మండల పరిధిలోని ఏనమీద తండాల్లో బుధవారం ఎయిడ్ ఎట్ ఆక్షన్ అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇటుక బట్టీలో పని చేసే కార్మికులకు ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలతో పాటు ఇతర జనరల్ పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. సుమారు 500 మంది ఇటుక బట్టీ కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎయిడ్ ఎట్ ఆక్షన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు భిక్షపతి యాదవ్, సంకురాత్రి పాటి ప్రవీణ్, కొత్త వెంకటేష్, మధు, నారాయణ, సంజయ్, వైద్యులు రాజేష్, బాబు, రవి, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు జాగ్రత్తగా నడపాలి

యాచారం సీఐ శంకర్‌కుమార్

యాచారం: రోడ్లపై వాహనాలు జాగ్రత్తగా నడపాలని యాచారం సీఐ శంకర్‌కుమార్ సూచించారు. సాగర్‌రోడ్డుపై బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనాదారులు జాగ్రత్తగా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరగవన్నారు. సాగర్‌రోడ్డుపై గునుగల్ గేట్ నుంచి మాల్ వరకు వాహనాలు తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా రాయుడు



నియామక పత్రం తీసుకుంటున్న నూకం రాయుడు

మంచాల: యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఆరుట్ల గ్రామానికి చెందిన నూకం రాయుడిని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ ఎదుగుదల కోసం క్రమశిక్షణతో కష్టపడి పని చేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. గ్రామాలలో యువతను చైతన్య పర్చి పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం రాయుడు మాట్లాడుతూ.. ఈ అవకాశం కల్పించిన రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి కాంగ్రెస్ యువజన విభాగం నాయకులకు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి గాలికుంటు వ్యాధికి టీకాలు

కడ్తాల్: మండల పరిధిలోని గ్రామాల్లో మార్చి 1 నుంచి 30 వరకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ చేయనున్నట్లు పశువైద్యాధికారి భానునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పశువైద్య సిబ్బంది రెండు బృందాలుగా గ్రామాల్లో పర్యటించి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ముద్విన్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులందరూ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కేవీ రమేశ్‌రాజుకు కమిటెడ్ సెక్రటరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న కేవీ రమేశ్‌రాజు

ఇబ్రహీంపట్నం రూరల్: కేవీ రమేశ్‌రాజు చేసిన సేవలను గుర్తించిన లయన్స్‌క్లబ్ వారు ఆయనకు కమిటెడ్ సెక్రటరీ అవార్డు అందజేశారు. మంగళవారం రాత్రి ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన సమావేశంలో లయన్స్ ఇంటర్నేషనల్ 320సీ రీజియన్ చైర్‌పర్సన్ లయన్ సాధు శ్యామ్ ప్రసాద్ ఆయనకు ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌రాజు మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి అవార్డు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ లయన్ ఇందూరి శ్రీనివాస్, ట్రెజరర్ లయన్ భీంరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

‘ముంపు’నకు శాశ్వత కట్టడి

- రూ.64 కోట్లు మంజూరు
- జోరుగా సాగుతున్న ఎస్‌ఎన్‌డీపీ పనులు



కొత్త మున్సిపల్ కార్యాలయం ఎదుట సాగుతున్న ఎస్‌ఎన్‌డీపీ పనులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లో ఎస్‌ఎన్‌డీపీ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందుకోసం గత ప్రభుత్వంలో రూ.64 కోట్లు మంజూరు చేయగా ప్రస్తుతం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం ఈ పనులు మొదలు పెట్టగా బిల్లుల జాప్యం కావడంతో కొన్ని నెలల పాటు పనులు నిలిపివేశారు. గుత్తేదార్లు బిల్లులు చెల్లిస్తేనే పనులు మొదలు పెడతామంటూ భీష్మించిన సంగతి తెలిసిందే. అనంతరం జరిగిన పరిణామ క్రమంలో ఎస్‌ఎన్‌డీపీ పనుల బిల్లులను బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ చెల్లిస్తుందని పనులు వేగవంతం చేయాలని వారికి భరోసా కల్పించడంతో పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి.

శాశ్వత పరిష్కారానికి..

అకాల వర్షాలకు గతంలో చాలా కాలనీలు నీట మునిగి నెలల తరబడి నీళ్లల్లోనే మునిగి ఉన్నాయి. శాశ్వత పరిష్కారం కోసం రూ. 64 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో ముంపు ప్రాంతాలైన 20వ డివిజన్‌లోని కొన్ని కాలనీలు, 22వ డివిజన్‌లోని శివనారాయణపురం, సాయిప్రభుహోమ్స్ కాలనీ, 23వ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీ, అల్మాస్‌గూడలోని 3వ డివిజన్‌లోని సాయిబాలానగర్ తదితర కాలనీలు, 4వ డివిజన్‌లోని పలు కాలనీలో వరద ముంపునకు గురవుతున్నట్లు నాడు ప్రణాళికలు వేసి ఎస్‌ఎన్‌డీపీ పైప్‌లైన్లను ఈ కాలనీల మీదుగా వేసుకుంటూ వస్తున్నారు. ఈ ట్రంక్‌లైన్ పనులు పూర్తి అయితే బడంగ్‌పేట కార్పొరేషన్‌కు ఎంత పెద్ద వరదలు వచ్చిన ఇక్క ఇల్లు కూడా నీట మునిగే ఆస్కారం లేకుండా అధికారులు, పాలకులు నడుం బిగించారు. ప్రస్తుతం కాకతీయ స్కూల్ వద్ద ట్రంక్‌లైన్ పనులు పూర్తి కాగా కొత్త మున్సిపల్ కార్పొరేషన్ ముందు బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన రహదారి మీదుగా పనులు సాగుతున్నాయి. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

సైన్స్ ఫెయిర్‌లతో సృజనాత్మకత

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మేలు

మీర్‌పేట: బడంగ్‌పేట్: విద్యార్థులు వినూత్నంగా ఆలోచించడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి అన్నారు. జాతీయ సైన్స్‌డే సందర్భంగా బుధవారం మీర్‌పేటలోని నాగార్జున మాంటిస్సోరి, ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్‌లో జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు విఠల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.మహేశ్, ఇన్‌చార్జిలు దుర్గ, సంధ్య, ప్రశాంతి, రాధిక పాల్గొన్నారు.

లార్డ్స్ స్కూల్‌లో...

మీర్‌పేట ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లోని లార్డ్స్ స్కూల్‌లో బుధవారం సైన్స్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప ముఖ్య అతిథిగా హాజరై రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.కిషన్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మీర్‌పేట: లార్డ్స్ స్కూల్‌లో రూపొందించిన నమూనాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



బడంగ్‌పేట్: సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

వసతుల కల్పనకు చర్యలు

మజీద్‌లను పరిశీలించిన అధికారులు



మజీద్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పహాడీషరీఫ్: త్వరలో ప్రారంభంకానున్న రంజాన్ నెలను పురస్కరించుకొని జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు మజీద్‌లను బుధవారం పరిశీలించారు. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశంలో మజీద్‌ల వద్ద సమస్యలు లేకుండా చూడాలని 21వ వార్డు కౌన్సిలర్ షేక్ ఫమిదా అఫ్జల్ ఉన్నతాధికారులకు విన్నవించారు. ఈ నేపథ్యంలో కమిషనర్ ఆదేశానుసారం ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు మజీద్‌ల వద్ద రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలపై ఆరా తీశారు. నిష్టతో ఉపవాస దీక్షలను పాటిస్తూ మజీద్‌లో ప్రార్థనలకు వచ్చే విశ్వాసులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఈ సందర్భంగా కౌన్సిలర్ కోరారు. వాదే ముస్తఫా, క్యూబా కాలనీ, వాదే సాల్హె హీన్, షాహీన్‌నగర్, ఎర్రకుంట, కొత్తపేట, ఉస్మాన్‌నగర్‌లలోని అన్ని మజీద్‌ల వద్ద ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు వెల్లడించారు.

కేఎల్లార్ జోలికొస్తే సహించేది లేదు

కాంగ్రెస్ జల్‌పల్లి నాయకులు



మాట్లాడుతున్న షేక్ జహంగీరుద్దీన్

పహాడీషరీఫ్: చెరువుల ఆక్రమణను పరిశీలించేందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్‌ను బదనాం చేసే వారిపై చట్టరీత్యా చర్యలకు ఫిర్యాదు చేస్తామని జల్‌పల్లి మున్సిపాలిటీ పార్టీ కో–ఆర్డినేటర్ షేక్ జహంగీరుద్దీన్ హెచ్చరించారు. జల్‌పల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26న జల్‌పల్లి చెరువు కింద ఎఫ్‌టీఎల్‌లో వెలిసిన నిర్మాణాలను పరిశీలించారు. ఈ పర్యటనతో హడలిపోయిన కొందరు భూకబ్జాదారులు రాత్రి పూట ‘ఈ భూములు కాంగ్రెస్ పార్టీకి చెందినవి’ అంటూ గోడలపై రాతలు రాసి బద్నాం చేసేందుకు కుట్ర పన్నారన్నారు. స్వాతంత్ర సమరయోధుడి కుటుంబాన్ని తెరపైకి తీసుకొచ్చి ఆరోపణలు చేయించడం వెనుక కబ్జాదారుల హస్తం ఉందన్నారు. రికార్డ్‌లలో ఆ సర్వే నంబర్లలో సమరయోధుడికి సంబంధించిన స్థలం లేదన్నారు. ఒకవేళ ఉన్నప్పటికీ ఎఫ్‌టీఎల్‌లో కేవలం సాగు మాత్రమే చేసుకోవాలని, ఎలాంటి చదును చేయరాదన్న నిబంధనలను గుర్తుంచుకోవాలని సూచించారు. గోడలపై రాతలు రాసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నామన్నారు. సమావేశంలో పార్టీ జల్‌పల్లి గ్రామ కో–ఆర్డినేటర్ చింతకింది నవీన్ గౌడ్, నాయకులు బాలాజీ, నవాజ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా



మొక్కలు నాటుతున్న వెంకటేశ్‌గుప్తా, ధశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: పర్యావరణ రక్షణకు, కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో తన జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్‌తో కలిసి సింగిల్‌విండో కార్యాలయంతో పాటు, ప్రధాన కూడలిలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మొక్కలునాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యం, జీవీజీ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ఇర్షాద్, నాయకులు అంజి, జగదీశ్, ఉపేందర్, సంతోశ్, రాంచంద్రయ్య, కిరణ్, దేవేందర్, వీరేందర్, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ స్రవంతి సూచించారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద స్మార్ట్ ఈషా ఉమెన్, చిల్డ్రన్ జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్, వైద్యులు సంపత్‌గౌడ్, మహేందర్, అనుపమా, మాధురి, శ్రీకార్తిక్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్ల అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి



పనులను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్‌లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాలాభివృద్ధికి కృషి చేయనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామాల సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తొలగిస్తానన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పెద్దూర్ తండాలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు రఘుతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరైన డబ్బుతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దేవి, నరేశ్, శ్రీను, మత్త్యాలు, పరీందర్, సురేందర్, ఈశ్వర్, భాస్కర్, రవీందర్, చందూలాల్, శారద, అచామి తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల అందజేత

మంచాల: మండల పరిధిలోని చిత్తాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ బొడ్డు నాగరాజ్‌గౌడ్ మనవరాలి కన్విశ్రీ అక్షరాభ్యాసం సందర్భంగా బుధవారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు.

బూర నర్సయ్యను కలిసిన నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: బీజేపీ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్టి రాములు కోరారు. ఎంపీ అభ్యర్థిగా బూర నర్సయ్యగౌడ్‌ను ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గణేష్, సత్యనారాయణ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం

హయత్‌నగర్ డివిజన్ డీవీఎం సుచరిత



బస్టాండ్‌లో సౌకర్యాలను తెలుసుకుంటున్న డీవీఎం సుచరిత

యాచారం: సాగర్‌రోడ్డుపై యాచారం మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను అన్ని విధాలుగా ఆధునీకరిస్తామని హయత్‌నగర్ డివిజన్ డీవీఎం సుచరిత పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్పతో కలిసి బుధవారం ఆమె యాచారం బస్టాండ్‌ను తనిఖీ చేశారు. బస్టాండ్ ఆవరణలో తిరిగి నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. తాగునీటి వసతిపై ఆరా తీశారు. బస్టాండ్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి బస్టాండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణం, తాగునీటి, మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యాం కల్పిస్తామన్నారు. సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి ఆర్టీసీ బస్సును బస్టాండ్‌లోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బుధవారం మండల కేంద్రంలో సీఎం చిత్రపటాన్ని పాలతో కడిగారు. ఈ సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు పర్చుతున్నందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన వైద్య సహాయం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీలను అమలు పరిచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, అంజయ్య గుప్తా, భగవాన్‌రెడ్డి, కృష్ణ, రాములు, తిరుపతిరెడ్డి, డేవిడ్, దామోదర్, వెంకటయ్య, మైసయ్య, జంగయ్య, యాదిరెడ్డి, రమేష్, మల్లేష్, వెంకటేష్, శ్రీను, రామ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



కందుకూరు: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు

హుడాకాంప్లెక్స్/మీర్‌పేట: రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 534 మంది విద్యార్థులకు గాను 523 మంది పరీక్ష రాశారు. 11 మంది గైర్హాజరయ్యారు. అందరూ సకాలంలో వచ్చి ప్రశాంతంగా పరీక్షలు రాశారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సైదులు తెలిపారు. విద్యార్థులకు అన్ని విధాలుగా వసతులు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

మీర్‌పేటలో

మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 13 కేంద్రాలలో ఇంటర్ పరీక్ష సజావుగా జరిగాయని ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపారు. 4,687 మంది విద్యార్థులకు గాను 4,496 మంది పరీక్షకు హాజరయ్యారని, కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు

కందుకూరు: మండల పరిధిలో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం మూడు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ద్వితీయ భాషా పరీక్షలో 1,239 మందికి గాను 1,208 మంది విద్యార్థులు హాజరుకాగా, 31 మంది గైర్హాజరయ్యారు. అందులో నేదునూరు మోడల్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మొత్తం 537 మందికి గాను 515 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరయ్యారు. కొత్తగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 308 మందికి గాను 302 మంది హాజరు కాగా, ఆరుగురు గైర్హాజరయ్యారు. విద్యామయి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 394 మందికి గాను 391 మంది హాజరు కాగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరనట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి.



కందుకూరు: నేదునూరు మోడల్ కళాశాలలో పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు



మీర్‌పేట: తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతిస్తున్న సిబ్బంది

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



పరీక్షల మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఫరీద్

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఫరీద్ ఆధ్వర్యంలో పరీక్షలకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రేమకుమారి, సుశీల, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మహేశ్, సిద్ధు, అబ్దుల్, రాహుల్, పవన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.